మల్కాజిగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులతో అన్ని డివిజన్ల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో డ్రైనేజీ, తాగునీరు సమస్యలు, పలు కాలనీల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ వంటి అభివృద్ధి పనులపై చర్చించారు. అదేవిధంగా నూతన అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేశామని, ఆగిపోయిన పనులను పునరుద్ధరించేందుకు, ప్రారంభించబోయే పనుల కోసం, జరుగుతున్న పనుల గురించి సంబంధిత అధికారులకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి, గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, అంజయ్య, జీఏసీ వెంకన్న, జీకె.హన్మంతరావు, ఉపేందర్‌రెడ్డి, కరంచంద్, చిన్నయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శ్రీనివాసులు, మల్లేష్‌గౌడ్, సయ్యద్ మోసిన్, బాలకృష్ణ, భాగ్యనంద్, ఉస్మాన్, ఇబ్రహీం, వంశీ, మహేష్, సూర్యప్రకాష్, మల్లేష్‌యాదవ్, నరేష్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించాలని వినతి


జీహెచ్ఎంసీ కమిషనర్‌తో సమావేశమైన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్‌లో సమస్యలతో పాటు నిలిచిపోయిన అభివృద్ధి పనుల ప్రారంభం వంటి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించినట్లు బొంతు శ్రీదేవి తెలిపారు. ప్రధానంగా డివిజన్‌లో నిలిచిపోయిన హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికల నిర్మాణాలపై కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. అలాగే నూతన కరెంట్ పోల్స్, హైమాస్ట్ లైట్స్ ఏర్పాటుతో పాటు రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా మ్యాన్‌హోల్స్ మూతల ఏర్పాటు, డీసిల్టింగ్ పనులను చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించిన కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులను ప్రారంభించాలని వినతి



జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం అందజేస్తున్న నాచారం కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరుతూ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు శుక్రవారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ వినతి పత్రం అందజేశారు. ఇప్పటి వరకు పెద్దనాలా డీసిల్టింగ్ పనులు చేయలేదని జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బాబానగర్ ఎస్టీపీ నుంచి నల్లచెరువు వరకు ఉన్న ట్రంక్‌లైన్‌కు చాలా కాలనీల వర్షపు నీటి లైన్లు కలిపారు. ట్రంక్ లైన్‌కి ఇప్పటి వరకు ఎలాంటి మెయింటెన్స్ చేయకపోవడంతో వర్షాకాలంలో మధ్యలో జామ్ అయితే పలు కాలనీలు ముంపునకు గురవుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఇందిరానగర్ కాలనీలో ఉన్న ట్రంక్ లైన్‌లోని సిల్ట్ తొలగింపు పనులను వెంటనే చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. బీఆర్‌ఎస్ నేత సాయిజెన్‌శేఖర్ తదితరులున్నారు.

ఘనంగా రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ శ్రీరంగగిరిపై జరుగుతున్న రంగనాథస్వామి నవమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రభాత ఆరాధన, తిరుప్పావై, ప్రబోదకి ఆరగింపు పూజా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. అనంతరం ధ్వజారోహణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నేతలు గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్‌తో పాటు డాక్టర్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్షకు ప్రత్యేక బస్సు సర్వీసులు


కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్

కాప్రా: గ్రూప్–1 పరీక్షకు ఆదివారం రోజు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్ తెలిపారు. కుషాయిగూడ డిపో తరపున ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. హైదరాబాద్‌లోని గ్రూప్–1 పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను సకాలంలో చేర్చేందుకు ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు చెప్పారు. కుషాయిగూడ డిపో తరపున ఆర్టీసీ నడుపుతున్న ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను గ్రూప్–1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రూప్–1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్ ఆల్ ది బెస్ట్ చెప్పారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి


అయోధ్యనగర్‌లో పర్యటిస్తున్న మేయర్ వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లో అసంపూర్తిగా మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. నగర పరిధిలోని 1వ డివిజన్ అయోధ్య కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు మధ్యలో ఆగిపోయిన విషయం కాలనీవాసులు మేయర్ దృష్టికి తెచ్చారు. మేయర్ సంబంధిత అధికారులు, గుత్తేదారులతో మాట్లాడారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఆర్‌ఎస్ పీర్జాదిగూడ అధ్యక్షుడు బండారి రవీందర్, పార్టీ నగర మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల, కాలనీ అధ్యక్షుడు రమణారెడ్డి, కైసర్, ప్రతినిధులు వెంకన్న, నర్సిరెడ్డి, గోపాలరెడ్డి, వెంకటయ్య, శివ, సోమేష్, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, దుర్గయ్య, యూసుఫ్ అలీ కాలనీవాసులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం రేషన్ బియ్యం పట్టుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడీ గ్రామానికి చెందిన దీరావత్ ప్రశాంత్(20) ఎదులాబాద్‌లో శుక్రవారం రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఓ ఇంట్లో దాచిపెట్టాడు. సమాచారం తెలుసుకున్న ఘట్‌కేసర్ పోలీసులు ఇంటిని తనిఖీ చేసి 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి ఇటుక బట్టీలు, కోళ్ల ఫారంలో పనిచేసే వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు

- 69,727 మంది అభ్యర్థుల కోసం 105 పరీక్షా కేంద్రాలు
- పరీక్షల నిర్వహణకు 531 మంది సిబ్బంది నియామకం
- ఈ నెల 9న ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు..
- 10 తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు
- అధికారుల సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్


మాట్లాడుతున్న అభిషేక్ అగస్త్య

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎలాంటి తప్పిదాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య(లోకల్ బాడీ) సంబంధిత అధికారులను సంయుక్తంగా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డితో కలిసి సబంధిత అధికారులతో గ్రూప్–1 పరీక్ష ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించారు. మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరవుతున్న 69,727 మంది అభ్యర్థులకు కోసం 105 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 105 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ఏడుగురు జాయింట్ కస్టోడియన్ ఆఫీసర్లు, 18 మంది రూట్ ఆఫీసర్లు, 22 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్ 276 ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, 105మంది అబ్జర్వర్లను నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే, ఏడు స్ట్రాంగ్ రూములను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలపై డిపార్టుమెంట్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖ పరమైన అధికారులతో సహా పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అదనపు కలెక్టర్లు పేర్కొన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ అరేంజ్‌మెంట్‌తో పాటు వసతులను పరిశీలించాలన్నారు.

◆ పరీక్షా కేంద్రానికి ప్రశ్న పత్రాలను పంపించడంతో పాటు పరీక్ష కేంద్రాల నుంచి జవాబు పత్రాలను రిసెప్షన్ సెంటర్‌కు తరలించడంలో పోలీసు బందోబస్తుతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా ముగిసేంత వరకు 3 గంటల పాటు జిరాక్స్ సెంటర్లను పూర్తిగా మూసి వేయించాలన్నారు. ఆడ, మగ అభ్యర్థులను విడివిడిగా తనిఖీ చేయాలన్నారు.

◆ 100 శాతం బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు ఉండేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రూట్ అధికారులు తమ లోకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలన్నారు. శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థి హాల్ టికెట్, ఫొటో పరిశీలించాలని సూచించారు.

◆ చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. పరీక్షా సమయంలో ఎలాంటి తప్పులు జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్ష రోజు ప్రతి సెంటర్‌ను మూడుసార్లు పరిశీలించాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోనికి ప్రవేశించడానికి ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అనుమతి ఉంటుందని, ఉదయం 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించబడదని తెలిపారు.

◆ పరీక్ష కేంద్రం మెయిన్ గేటు ఉదయం 10 గంటలకు మూసి వేయబడుతుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు కనీసం ఒక్కరోజు ముందుగా తమ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, ఖచ్చితమైన ప్రదేశాన్ని తెలుసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, చేతి గడియారాలు, హ్యాండ్ బ్యాగులు అనుమతించబడదన్నారు. అభ్యర్థులు ఆందోళనకు గురికావొద్దని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రశ్నపత్రాన్ని భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను సన్నద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిపార్టుమెంట్, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ అధికారులు పాల్గొన్నారు.

సత్కారం


మల్లిఖార్జున్‌యాదవ్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన మల్లిఖార్జున్‌యాదవ్‌ను శుక్రవారం పలువురు బీజేపీ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు వెంకటేష్, పర్వతాలు, వినోద్ యాదవ్, శైలేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

సొంతింటికి చేరుకున్న రమాదేవి


ఇంట్లోకి వెళ్తున్న రమాదేవి తదితరులు

ఉప్పల్: కన్నతల్లిని కొడుకు బుధవారం ఇంటి నుంచి బయటకు గెంటివేసిన ఘటన విధితమే.. ఎట్టకేలకు ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని వృద్ధురాలు రమాదేవి శుక్రవారం సొంత ఇంటికి చేరుకున్నారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చిలుకానగర్‌లోని రమాదేవి ఇంటికి ఉన్న తాళాన్ని తొలగించి ఇంట్లోకి పంపారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. తమకు సహకరించిన అధికారులు, మీడియా ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

తెల్లరేషన్ కార్డు ఉన్నవారు విద్యుత్ బిల్లు చెల్లించొద్దు


ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: తెల్లరేషన్ కార్డు ఉన్న వారంతా విద్యుత్ బిల్లులు చెల్లించొద్దని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే లబ్ధిదారులు గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్నవారు, జీరో బిల్లు రాకున్నా బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అమాయకుల దగ్గర బిల్లులు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మైనార్టీ విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలలో చేరాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని మైనార్టీలు రెసిడెన్షియల్ పాఠశాలలో చేరాలని కోరుతూ మైనార్టీ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ.. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు పేద పిల్లలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. మైనార్టీ విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో సాధిక్, అహ్మద్‌పాషా, మతిన్, ఖాసీ, శంషోద్దీన్, ఇమామ్, ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహనం.. సంస్థ అభివృద్ధికి పునాది


ఆర్టీసీ ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు అందిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెకంటేశ్వర్లు

కాప్రా: ఆర్టీసీ ఉద్యోగుల సహనం, ఓర్పుతో విధులు నిర్వర్తించడమే సంస్థ అభివృద్ధికి పునాది అన్నారు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కుషాయిగూడ డిపోలో సికింద్రాబాద్ రీజినల్ స్థాయి ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 24 మంది ఉద్యోగులకు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2017 నుంచి సంస్థ ఉద్యోగులు సహనంగా పీఆర్సీ తీసుకున్నప్పటి నుంచి మరింత నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ఆర్టీసీ సంస్థను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం డిపోలో నూతనంగా నిర్మించిన శిక్షణ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఖాన్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ భీంరెడ్డి, కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్, రీజినల్ పరిధిలోని ఇతర డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

చర్మ పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి


హబ్సిగూడ సుప్రభాత్ హోటల్‌లో వర్క్‌షాప్

హబ్సిగూడ: రాష్ట్రంలో చర్మ పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలను కల్పించాలని అంబేడ్కర్ రాష్ట్ర సంఘం రాపోలు రాములు అన్నారు. తెలంగాణ రాష్ట్ర చర్మ కార్మికుల సంక్షేమ సంఘం కో–ఆర్డినేటర్ మైసయ్య ఆధ్వర్యంలో శుక్రవారం హబ్సిగూడలోని సుప్రభాత్ హోటల్‌లో దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ సహకారంతో చర్మకారులను పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి అంబేడ్కర్ రాష్ట్ర సంఘం రాపోలు రాములు, రామగుండం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ మాజీ డీజీఎం ఆరేపల్లి రాజేందర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం హాజరయ్యారు. కార్యక్రమంలో చంద్రమౌళి, సారయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సెంటర్ నిర్లక్ష్యంతో

గ్రూప్–1 పరీక్ష కోల్పోయిన విద్యార్థి

అల్వాల్: ప్రైవేటు ఆన్‌లైన్ సెంటర్ నిర్లక్ష్యంతో గ్రూప్–1 విద్యార్థి పరీక్ష కోల్పోయింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ సూర్యనగర్‌లో నివాసముండే సువర్ణ మూడు నెలల క్రితం అల్వాల్‌లోని ఓ ప్రైవేటు ఆన్‌లైన్ సెంటర్‌లో గ్రూప్–1 పరీక్షకు దరఖాస్తు చేసుకుంది. ఆ సమయంలో దరఖాస్తు సక్సెస్ అయిందని చెప్పిన నిర్వాహకులు హాల్ టికెట్ కోసం ఇక్కడికి రావాల్సి ఉంటుందని, ఆ సమయంలో హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేస్తామని తెలిపారు. కొద్ది రోజుల్లో పరీక్ష ఉండటంతో ఆన్‌లైన్ సెంటర్‌కి వెళ్లి అడగ్గా సర్వర్ డౌన్ ఉందని, మరోమారు రావాలని చెప్పారు. దీంతో పక్కన మరో సెంటర్‌కి వెళ్లి తనిఖీ చేయగా అసలు దరఖాస్తు పూర్తి కాలేదన్నారు. దరఖాస్తు చేసుకున్న సెంటర్ వద్దకు వచ్చి నిలదీయగా తాము ఇప్పుడేం చేయలేమని చెప్పడంతో బాధితురాలు అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తాను రాసే ప్రతి పరీక్ష ఒకే సెంటర్‌లో దరఖాస్తు చేసుకుంటానని, ఆ నమ్మకంతో గ్రూప్–1 పరీక్షకు వేలాది రూపాయలు వెచ్చించి శిక్షణ తీసుకున్నానని, తీరా పరీక్ష సమయానికి హాల్ టికెట్ రాకపోవడంతో ఆవేదనకు గురయ్యానని సువర్ణ తెలిపారు.

ఘనంగా సార్వజనికోత్సవం


శారీరక ప్రదర్శనలు చేస్తున్న శిక్షార్థులు

పోచారం: అన్నోజిగూడలోని విద్యావిహార్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శిక్షా వర్గ సార్వజనికోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి వంటి ఆర్‌ఎస్‌ఎస్ నుంచి పలు శాఖలు ఆవిర్భవించాయన్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా సంఘ సభ్యులు ఉండటం శుభపరిణామంగా పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్ ముఖ్య వక్తగా సందేశమిచ్చారు. తొలుత శిక్షార్థులు శారీరక ప్రదర్శనలు చేశారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ కాలనీలో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. విద్యుత్ అంతరాయానికి కాలనీవాసులు సహకరించాలని పేర్కొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యేకి వినతి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తూ..

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం డివిజన్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సమస్యలు ఉన్నాయని వారు ఆయనకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డోలి రమేష్, శంకర్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి


టెంపుల్ అల్వాల్ వద్ద బడిబాట కార్యక్రమం

అల్వాల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని టెంపుల్ అల్వాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మీ అన్నారు. శుక్రవారం టెంపుల్ అల్వాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో స్రవంతి, సంతోషి, సులోచన విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కుషాయిగూడ: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ డి.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. లోక్ అథాలత్‌లో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి.బాల భాస్కర్‌రావు, అడిషనల్ జడ్జి ఆర్. రఘునాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్, రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి పాల్గొంటారని తెలిపారు. సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


జెడ్సీ అభిలాషకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: డివిజన్ పరిధిలోని చినరాయుని చెరువు, కొత్త చెరువుల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ శుక్రవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రోనాల్డ్‌రాస్, జోనల్ కమిషనర్ అభిలాషను కలిసి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో పార్కుల సుందరీకరణ, వీధి దీపాల ఏర్పాటు, నూతన బాక్స్ డ్రైయిన్ తదితర సమస్యలను పరిష్కరించాలని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి హాస్పిటల్ ఎదుట ధర్నా



రామంతాపూర్: ప్రభుత్వ హోమియో ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ వార్డులో స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడిన సంఘటన ఏఐవైఎఫ్ విద్యార్థులు శుక్రవారం హోమియోపతి హాస్పిటల్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఆసుపత్రులకు నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.